# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 19-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. రాష్ట్రంలో ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు.

2. 'ఎన్టీఆర్ వైద్య సేవ' పేరుతో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు.

3. స్థూల దేశీయోత్పత్తిలో స్థిరాస్తి రంగం ప్రముఖ పాత్ర పోషిస్తుందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ పేర్కొన్నారు.

4. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రాష్ట్రంలో కొత్త బస్సులను కొనుగోలు చేయనున్నామని ఏపీయస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు వెల్లడించారు.

==========================

రాష్ట్రంలో ఏక వినియోగ ప్లాస్టిక్ నిషేధానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ తెలిపారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా రాష్ట్రంలో ప్లాస్టిక్ నిషేధానికి తీసుకుంటున్న చర్యలుపై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ,

వాయిస్ సెకన్లు

--------------------------

రాష్ట్రంలో 'ఎన్టీఆర్ వైద్య సేవ' పేరుతో ఆరోగ్యశ్రీ సేవలు కొనసాగుతున్నాయని, నిలిచిపోలేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పష్టం చేశారు. శాసనసభ సమావేశాల్లో భాగంగా ఆరోగ్యశ్రీ సేవల అంశంపై మంత్రి మాట్లాడుతూ, ఎన్డీఏ ప్రభుత్వం ఆరోగ్య శ్రీ పేరును డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవగా మార్చిందన్నారు. సేవలు నిలిపివేసినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని మంత్రి తెలియజేస్తూ,

వాయిస్ సెకన్లు

--------------------------

స్థూల దేశీయోత్పత్తి–జిడిపిలో స్థిరాస్తి రంగం ప్రముఖ పాత్ర పోషిస్తుందని విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ తెలిపారు. జాతీయ రియల్ ఎస్టేట్ అభివృద్ధి మండలి–నారెడ్కో ఆధ్వర్యంలో మూడు

రోజులపాటు జరగనున్న విజయవాడలో జరిగే అమరావతి ప్రాపర్టీ షో కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. అనంతరం కేశినేని శివనాథ్ మాట్లాడుతూ, రియల్ ఎస్టేట్ రంగం సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అమరావతి నిర్మాణంతోపాటు స్థిరాస్తి రంగం అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని తెలిపారు.

---------------------------

ప్రజాసేవ, సుపరిపాలనకు ప్రాధాన్యమిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ఎన్డీయే ప్రభుత్వం భారత్ ను అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు కృషి చేస్తోంది. "సేవా పర్వ్" పేరుతో ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగం ప్రత్యేక కథనాలను అందిస్తోంది. వ్యవసాయంలో అధునాతన సాంకేతికత ద్వారా కేంద్రప్రభుత్వం రైతులకోసం చేపట్టిన చర్యల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

వాయిస్ ఓవర్ (1 : 21 )

---------------------------

ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా రాష్ట్రంలో కొత్తగా 1500 బస్సులను కొనుగోలు చేయనున్నామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –ఏపీయస్ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు చెప్పారు. అనంతపురం జిల్లాలోని ఉరవకొండ, గుంతకల్లు, గుత్తి ఆర్టీసీ బస్టాండ్, డిపోలను ఆయన నిన్న తనిఖీ చేశారు. అనంతరం ఉరవకొండలో ద్వారకా తిరుమలరావు మాట్లాడుతూ.. 1050 విద్యుత్తు బస్సులు కొనుగోలు చేశామని నెల రోజుల్లో అవి అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకం విజయవంతంగా అమలవుతోందని స్త్రీశక్తి పథకం బస్సుల్లో ఆక్యుపెన్సీ నిష్పత్తి శాతం 90గా ఉందని తెలిపారు.

---------------------------

పశ్చిమ గోదావరి జిల్లాలో "స్వస్థ్ నారీ స శక్తీ పరివార్ అభియాన్" ద్వారా మహిళలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని పాలకోడేరు వైద్యాధికారి డాక్టర్ గులాబ్ రాజ్ తెలిపారు. జిల్లాలోని వంకాయలపాలెం శెట్టి బలిజ పాలెం గ్రామాలలో ఈరోజు వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గులాబ్ రాజ్, మాట్లాడుతూ ఈ శిబిరాల ద్వారా మహిళలకు రక్తపోటు ,షుగర్ , క్యాన్సర్ వంటి రోగాలకు వైద్యపరీక్షలు నిర్వహిస్తున్నామని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

---------------------------

వస్తు సేవల పన్ను – జీఎస్టీ విధానాలను సరళీకృతం చేయడం ద్వారా ప్రజలపై ఆర్థిక భారం తగ్గించే చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టడాన్ని పలువురు స్వాగతిస్తున్నారు.జీఎస్టిలో స్లాబులను తగ్గించడం ద్వారా కొనుగోలు శక్తి పెరుగుతుందని విశాఖపట్నం చెందిన స్థానికుడు ఆకాశవాణికి తెలియజేస్తూ

వాయిస్ సెకన్లు

---------------------------

సుప్రసిద్ధ తెలుగు రచయిత.... పాత్రికేయులు, సంఘ సంస్కర్త తాపీ ధర్మారావు జయంతి ఈ రోజు. 1887 సెప్టెంబర్ 19 వ తేదీన ఒడిషా రాష్ట్రంలోని బెర్హంపూర్ పట్టణంలో జన్మించిన ఆయన తెలుగు పాత్రికేయ రంగంలో వ్యావహారిక భాషకు మార్గ దర్శకునిగా...., తెలుగు రచయితలలో ప్రముఖునిగా పేరొందారు. ఆయన

సాహితీ రచనలు భారతీయ సాహితీ రంగంలో సుస్థిర స్థానం సంపాందించాయి. తాతాజీగా పేరుగాంచిన తాపీ ధర్మారావుకు తెలుగు చలన చిత్ర రంగంతో విడదీయరాని అనుబంధం ఉంది. "మాల పిల్ల..., "రైతు బిడ్డ" "ద్రోహి". " భీష్మ" వంటి జనాదరణ పొందిన చిత్రాలకు సంభాషణలు రాశారు. సాహిత్య అకాడెమీ పురస్కారాన్ని అందుకున్న తాపీ ధర్మారావు 1973 మే 8వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 126వ సంచిక ఈనెల 28వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 26వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర మిషన్ కింద సంక్షేమ వసతి గృహాలలో మరుగుదొడ్లను నిర్మిస్తామని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. నెల్లూరులోని కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో ఆయన ఈ రోజు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పంచాయతీలలో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించడంలో ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు.

---------------------------

తిరుమల శ్రీవెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు భద్రతా ఏర్పాట్లు పూర్తయ్యాయని తిరుపతి ఎస్పీ సుబ్బారాయుడు తెలిపారు. తిరుమల లో ఆయన నిన్న పాత్రికేయులతో మాట్లాడుతూ గత బ్రహ్మోత్సవాల్లో లోపాలను గుర్తించి ప్రత్యేకమైన భద్రతా చర్యలు చేపట్టామని చెప్పారు. భద్రత కోసం తిరుమలలో 3 వేల మంది, తిరుపతిలో వెయ్యి మంది పోలీసులను వినియోగిస్తున్నామన్నారు. గరుడ సేవ రోజు తిరుమల ఘాట్ రోడ్డుల్లో ద్విచక్రవాహనాల రాకపోకలపై ఆంక్షలు ఉంటాయని, తిరుమల వచ్చే భక్తులు ఆర్టీసీ బస్సుల ద్వారా రావాలని కోరారు.

---------------------------

బంగాళాఖాతంలో ఈ నెల 25 తర్వాత అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.దీని ప్రభావంతో ఆంధ్రప్రదేశ్ లో రానున్న నాలుగు రోజుల పాటు దక్షిణ కోస్తా, రాయలసీమలో కొన్ని ప్రాంతాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్ర అధికారిణి జి. లక్ష్మి తెలిపారు.

---------------------------

---------------------------

---------------------------

=====================